క్లుప్తంగా

31న సంగీత విభావరి



పటమట(విజయవాడతూర్పు): మంగళగిరి వద్ద సి.కె కన్వెన్షన్‌లో ఈ నెల 31వ తేదీన ప్రముఖ గాయకుడు హరిచరణ్‌తో సంగీత విభావరి నిర్వహిస్తున్నామని రవి మెలొడీస్ మేనేజింగ్ డైరెక్టర్ రవి కుమార్ మంద తెలిపారు. గురువారం లబ్బీపేటలోని ఓ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను తెలిపారు. బుక్ మై షో లో టికెట్లు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రొడ్యూసర్ వీరా మాట్లాడుతూ రవి మెలొడీస్ టాలెంట్ సింగర్స్ కి ప్లాట్ ఫారం ద్వారా వెలుగులోకి తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. సంస్థ ఆర్టిస్ట్ మేనేజర్ మహేష్ మంద మాట్లాడుతూ విజయవాడకు మంచి సంగీత విభావరి రావాలని కోరుకున్నామని, అది ఇప్పుడు సాధ్యమవుతుందని అన్నారు. డ్యాన్సర్ అక్సా ఖాన్ మాట్లాడుతూ విజయవాడలో 31న ఈవెంట్‌ను విజయవంతం చేయాలని కోరారు. బొమ్మినేని ఇన్ ఫ్రా స్ట్రక్చర్స్ మేనేజింగ్ డైరెక్టర్ నవీన్, హర్షిత డెవలపర్స్ చైర్మన్ పాండురంగా రావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులను దేశానికి అందించడమే లక్ష్యం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): క్రమశిక్షణతో కూడిన విద్యాబోధనతోపాటు విద్యార్థి ప్రవర్తన, నడవడిక, నైతికవర్తన వంటి అంశాలను సైతం విద్యాబోధనలో మిళితం చేసి దేశ అభివృద్ధికి అవసరమైన ఉత్తమ పౌరులను అందించడమే లక్ష్యంగా విజ్ఞాన విహార ఎడ్యుకేషనల్ సొసైటీ కృషి చేస్తోందని సొసైటీ అధ్యక్షుడు బి.వి.ఎస్.టి. సాయి అన్నారు. గురువారం ఎనికేపాడు విజ్ఞాన విహార ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ఇటీవల విడుదలైన సీబీఎస్‌ఈ ఫలితాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి ఇదే పాఠశాలకు అతిథులుగా రావాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. శైలజ, ఉప ప్రధానోపాధ్యాయులు జి. రామాంజనేయులు పాల్గొన్నారు.

లా నేస్తం పథకాన్ని పునరుద్ధరించాలి

విజయవాడలీగల్: జూనియర్ న్యాయవాదులకు ఆసరాగా నిలిచేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన లా నేస్తం పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) అధ్యక్షుడు, కృష్ణా జిల్లా బార్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎ.కె.బాషా కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు లా నేస్తం పథకం దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్నా ఇప్పటి వరకు నిధులు మంజూరు చేయకపోవడంతో జూనియర్ న్యాయవాదులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీబీఏ ప్రధాన కార్యదర్శి కేవీ రంగారావు, ఉపాధ్యక్షుడు పిళ్లా శ్రీనివాసరావు, కోశాధికారి ముద్దాడ సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి జి.వరాహలక్ష్మి, మహిళా కార్యదర్శి కె.అనురాధ, గవర్నింగ్ బాడీ సభ్యులు, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వట్టిపల్లి



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిని విజయవాడకు చెందిన వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగి వట్టిపల్లి రామస్వామి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని రాజగృహలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఈ రత్నప్రదీష్ ప్రకటించారు. అనంతరం సభ్యులు ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వట్టిపల్లి రామస్వామిని సత్కరించారు. కార్యక్రమంలో ఎం. వెంకటేశ్వరరావు, మోహన్‌దాస్, నరసయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సినీ రచయిత బీకే ఈశ్వర్ కన్నుమూత

సాక్షి, హైదరాబాద్: సీనియర్ సినిమా జర్నలిస్ట్, సినీ రచయిత బీకే ఈశ్వర్ (77) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. విజయవాడకు చెందిన ఈశ్వర్ సినీ పత్రికల్లో ఉప సంపాదకుడిగా పని చేశారు. పలు పత్రికలకు, వీక్లీలకు వ్యాసాలు రాయడంతోపాటు కొన్ని టీవీ సీరియల్స్ కూడా రాశారు. వాటిలో కొన్ని నంది అవార్డులను అందుకున్నాయి. 'హృదయాంజలి' చిత్రానికి మాటలు, పాటలు అందించారు. పలు సినిమాలకు రచయితగా పనిచేశారు. కాగా గురువారం హైదరాబాద్‌లో బీకే ఈశ్వర్ అంత్యక్రియలను కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఆయన మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

'సర్వీస్' స్టాప్!



మట్టి సర్వీస్ రోడ్డు కన్నా ఎత్తులో ఉన్న యూజీడీ మ్యాన్ హోల్

- ఏడాది దాటినా పూర్తికాని సర్వీసు రోడ్డు పనులు
- మధురానగర్ ఆర్‌యూబీ వద్ద వాహనదారుల కష్టాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ ఆర్‌యూబీ అందుబాటులోకి వచ్చి ఏడాది దాటినా ఇంత వరకు సర్వీసు రోడ్ల పనులు మాత్రం పూర్తి కాలేదు. దీంతో ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగించే మధురానగర్, పసుపుతోట, వీవీ నరసరాజు రోడ్డు, నేతాజీ కాలనీ, సాయిబాబా కాలనీ, బుడమేరు మధ్యకట్ట, విజయదుర్గానగర్, దేవీనగర్, జీవీఆర్ నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్, బానూనగర్, సత్యనారాయణపురం రైల్వేకాలనీ, దుర్గాపురం తదితర ప్రాంత వాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పనులు పూర్తిచేయకపోవటంతో పాటు అంతర్గత అప్రోచ్ రోడ్డు పనులను తూతూమంత్రంగా చేసి వదలివేశారు. దీంతో మలుపులు తిరిగే టప్పుడు వాహనచోదకులు తరచూ జారి పడిపోవడంతో పాటు గాయాలబారిన పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు చిన్నారులు, వృద్ధులు ఈ మార్గంలో ఉన్న స్కూలు, బ్యాంకులకు వచ్చినప్పుడు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఏడాది దాటినా..

ఎన్నికలకు ముందే అప్పటి ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రజల అవసరాల మేరకు ఆర్‌యూబీని ప్రారంభించారు. ఇంతలో ఎన్నికలు రావటం ప్రభుత్వం మారటంతో సర్వీసు రోడ్డు పనులు నత్తనడకన సాగాయి. ఇక్కడ ఏడాది దాటినప్పటికీ ఇంత వరకు పనులు పూర్తికాకపోవటం గమనార్హం.

చినుకు పడితే చిత్తడే..

ఇక్కడ సర్వీసు రోడ్డు పనులు పూర్తికాకపోవటంతో చినుకుపడితే చిత్తడిగా మారుతోంది. కొద్దిపాటి వర్షానికే బురదగా మారటంతో పాటు వర్షపునీరు నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అలాగే ఇక్కడ రాకపోకలు సాగించే క్రమంలో దుమ్ము, ధూళి లేచిపోయి శ్వాసకోశ సంబంధ వ్యాధులు వస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వాహనాలకు భద్రత కరువు..

సర్వీసు రోడ్లలో రాళ్లు లేచి ఉండటంతో తరచూ వాహనాలు పాడవుతున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రోడ్డు సక్రమంగా లేకపోవటం వల్ల డిస్క్ సమస్యలు సైతం వస్తున్నాయని వాపోతున్నారు. మలుపులు తిరిగే క్రమంలో వాహనాలు స్లిప్ అయి పడిపోతుండటంతో గాయాలబారిన పడుతున్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

సర్వీసు రోడ్డులో మ్యాన్ హోల్ ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ రోడ్డు కన్నా మ్యాన్‌హోల్ ఎత్తులో ఉండటం వల్ల తరచూ వాహన చోదకులు మ్యాన్ హోల్‌ను ఢీకొట్టి గాయాలబారిన పడుతున్నారు. ఇప్పటికే నగరపాలకసంస్థ కమిషనర్ సైతం మ్యాన్ హోల్ రోడ్డుతో సమాంతరంగా చేయాలని అధికారులకు సూచించినప్పటికీ, పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పనులు పూర్తి చేయాలి..



సాయిబాబాకాలనీ సర్వీస్ రోడ్డు పనులు పూర్తి కాకపోవటంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రాకపోకలు సాగించే క్రమంలో దుమ్ము లేచి అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో తరచూ పలువురు ప్రమాదాలకు గురై గాయాలబారిన పడుతున్నారు. అలాగే వాహనాలు సైతం పాడవుతున్నాయి. అధికారులు స్పందించి సర్వీసు రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి.

– ఎస్‌కే చాంద్ బాషా, నేతాజీ కాలనీ

వాహనాలు పాడవుతున్నాయి..



సర్వీసు రోడ్డులో రాళ్లులేచి పోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. ఈ రోడ్డులో రాకపోకలు సాగించటం వల్ల వాహనాలు తరచూ పాడవుతున్నాయి. ఇక్కడ రోడ్డు ఎప్పుడు వేస్తారా అని ఆశగా ఎదురు చూస్తున్నాం. ఇక్కడ సర్వీసు రోడ్డు పూర్తిచేయ లేదు కానీ మధురానగర్‌లో మరో ఆర్‌టీబీ నిర్మాణానికి సర్వే చేయటం ఆశ్చర్యంగా ఉంది.

– బోనం నాగు, మధురానగర్

గార్బేజ్ పాయింట్స్‌పై ప్రత్యేక శ్రద్ధ అవసరం

అధికారులతో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వ్యర్థాల తరలింపుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ప్రజారోగ్య విభాగం, ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. గురువారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన సమావేశ మందిరంలో ఆయన అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శానిటేషన్ సెక్రటరీలందరూ నిత్యం క్షేత్రస్థాయిలో ఉండాలని, పారిశుద్ధ్య కార్మికుల హాజరును పరిశీలించాలని, మూడు నెలల కంటే ఎక్కువగా గైర్హాజరైన కార్మికులకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతిరోజు సచివాలయం పరిధిలోని సెక్రటరీ అన్ని వీధుల్లో శుభ్రతను పరిశీలించాలని, ఎక్కడైతే చెత్త, వ్యర్థాలను అధికంగా ఉంటున్నాయో వాటిపై దృష్టి సారించి వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. ప్రజారోగ్యం సిబ్బంది ప్రజలకు ఆరోగ్యం పట్ల అవసరమైన అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని, ఫ్రైడే–డ్రైడే ఇలాంటి పూర్తిస్థాయిలో నిర్వహించాలన్నారు. నగరంలో బల్క్ వేస్ట్ జనరేటర్లయిన ఫంక్షన్ హాల్స్, హోటళ్లు, రెస్టారెంట్లు వద్ద ప్రత్యేకంగా శ్రద్ధ చూపించాలని అన్నారు. అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ బాబు శ్రీనివాస్, డాక్టర్ అన్నపూర్ణ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి. సోమశేఖర్ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

నగరాన్ని పరిశుభ్రంగా, అందంగా ఉంచాలి

పటమట(విజయవాడతూర్పు): నగరాన్ని పరిశుభ్రంగా, అందంగా ఉంచాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం సర్కిల్–3 పరిధిలోని ఫిలిం కాలనీ, మొగల్రాజపురం, క్రీస్తు రాజపురం, ఎస్ఎల్‌వీ, ఎంజీ రోడ్డు ప్రాంతాలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫిలిం కాలనీలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. క్రీస్తు రాజపురంలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గా లేదని.. సెక్రటరీలు, వర్కర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎటువంటి అలసత్వం వహించొద్దని హెచ్చరించారు. అనంతరం ఆయన అమృత్ పథకంలో భాగంగా నిర్మించబోతున్న డ్రైనేజ్ పంపింగ్ స్టేషన్ కోసం ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించారు. పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్‌రెడ్డి చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్ ఇన్‌చార్జ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ లతా తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ స్కూల్ విద్యార్థులకు మంచి ర్యాంకులు



పాలిటెక్నిక్ ఎంట్రన్స్‌లో ర్యాంకుల సాధించిన విద్యార్థులతో జిల్లా సైన్స్ అధికారి హుస్సేన్

పాయకాపురం(విజయవాడరూరల్): పుచ్చలపల్లి సుందరయ్య మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ఫిజిక్స్ ఉపాధ్యాయులు, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ ఓ ప్రకటనలో తెలిపారు. మూడు సంవత్సరాల డిప్లొమో ప్రవేశాలకు జరిగిన పరీక్షల్లో సుందరయ్య హైస్కూల్ విద్యార్థులు సుమారు 20 మంది పరీక్షలకు అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో సైన్స్‌లో 100కి 100 మార్కులు తెచ్చుకోవడంతో పాటు ముఖ్యంగా ఈ పరీక్షలో సాయి అక్షయ అనే విద్యార్థి 104 మార్కులతో 3,146 ఉత్తమ ర్యాంకును సాధించినట్లు తెలిపారు. అనిల్ కుమార్, హర్షవర్ధన్, చంద్రిక, భువనేశ్వరి విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్‌బీఐ ఖాతాదారుడికి బీమా చెక్కు పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ ఎస్‌బీఐ ఖాతాదారుని కుటుంబానికి గురువారం ఎస్‌బీఐ అధికారులు వ్యక్తిగత ప్రమాద బీమా పథకంలో భాగంగా రూ. 20లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ డీజీఎం మనీష్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ మధురానగర్ ఎస్‌బీఐ ఖాతాదారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో చనిపోయారన్నారు. ఆయనకు ఎస్‌బీఐ ఖాతాతో పాటు ప్రమాద బీమా పథకం ఉందన్నారు. దీంతో తాము ప్రమాద బీమా పథకంలో భాగంగా రూ. 20లక్షల చెక్కును అందజేస్తున్నట్లు తెలిపారు. ఎస్‌బీఐ మధురానగర్ బ్రాంచి మేనేజర్ వై శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ తమ ఖాతాదారుడు కేవలం రూ. వెయ్యి చెల్లించటం ద్వారా ప్రమాద బీమా చేయించుకున్నారన్నారు. తద్వారా ఇప్పుడు రూ.20లక్షలను వారి కుటుంబ సభ్యులకు అందజేస్తున్నట్లు తెలిపారు. రీజనల్ మేనేజర్ బి. నవీన్‌బాబు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మందిర వార్షికోత్సవం



పూజలు చేస్తున్న రాష్ట్ర ఎన్జీవోల సంఘ నేతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ మెయిన్ రోడ్డు పై ఓవర్ సమీపంలోని ఓంకార క్షేత్రం శ్రీ షిర్డీసాయిబాబా మందిరం 14వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు బాబావారికి విశేషంగా అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల సంయుక్త కమిషనర్, (జీఎస్టీ) పేరం రామకోటేశ్వర రావు, నగరపాలక సంస్థ సహాయ ప్రజారోగ్యశాఖ అధికారి సర్కిల్–1 డాక్టర్ అన్నపూర్ణ వేడుకలలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. నగర ప్రముఖుల చేతుల మీదుగా బాబా మందిరంలో శ్రీ ఓంకారేశ్వరస్వామి శివలింగం, శ్రీ లలితాదేవి సమేత శ్రీ ఓంకారేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. అలాగే దాతల సహకారంతో బాబావారికి దర్బార్ నిర్మాణ పనులు, అన్న ప్రసాద వితరణ చేశారు. రాష్ట్ర ఎన్జీవో సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.విద్యా సాగర్ రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గుళ్లపల్లి నారాయణరావు, పశ్చిమ కృష్ణా ఎన్జీవో సంఘ అధ్యక్షుడు డి. సత్యనారాయణ రెడ్డి, నగర అధ్యక్షుడు సీవీఆర్ ప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మద్యం మత్తులో డ్రైవింగ్.. 79మందికి జరిమానా

విజయవాడస్పోర్ట్స్: మద్యం తాగి మోటారు వాహనాలు నడిపిన 79 మందికి 6వ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు భారీగా జరిమానా విధించినట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు. 5వ ట్రాఫిక్ పోలీసులు ఈ నెల 14వ తేదీ రాత్రి జరిపిన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన 79 మంది పట్టుబడినట్లు వెల్లడించారు. వీరిని న్యాయమూర్తి లెనిన్‌బాబు వద్ద గురువారం హాజరుపర్చామని తెలిపారు. నిందితుల్లో 14 మందికి ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున, 65 మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జిల్లా వ్యాప్తంగా రోజూ విధిగా వాహనాలను తనిఖీ చేస్తున్నామని, మద్యం మత్తులో వాహనాలు నడిపే వ్యక్తులపై కేసులు నమోదు చేస్తున్నట్లు సీపీ రాజశేఖరబాబు తెలిపారు.

స్కేటింగ్ పోటీల్లో సత్తా



చిన్నారులు, కోచ్‌ను అభినందిస్తున్న ప్రేమ్ కుమార్ లకావత్ తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఢిల్లీలో ఏప్రిల్ 30 నుంచి మే 5వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన నేషనల్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో సత్యనారాయణపురం రైల్వే కాలనీ రింక్ చిన్నారులు సత్తాచాటారు. పోటీలలో దినేష్ కుమార్ చౌదరి వెండి పతకం, జై శ్రీ సాయి కాంస్య పతకం, తన్మయ రెండు వెండి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా గురువారం సత్యనారాయణపురం రైల్వే రింక్ కోచ్ ఎండీ ఖాజా చిన్నారులతో రైల్వే సీనియర్ డివిజనల్ పర్సనల్ బ్రాంచి ఆఫీసర్ ప్రేమ్‌కుమార్ లకావత్, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ వరహాల బాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోటీలలో విశేష ప్రదర్శన కనబరుస్తున్న చిన్నారులను అభినందించారు. అలాగే ఇతర ఈవెంట్స్ నేషనల్ మెడల్ సాధించిన వారిని సత్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ డివిజనల్ పర్సనల్ బ్రాంచ్ ఆఫీసర్ ప్రేమ్ కుమార్ లకావత్ మాట్లాడుతూ కోచ్ ఎండీ ఖాజా రైల్వే స్కేటింగ్ రింగ్‌లో 2014 నుంచి కోచ్‌గా పిల్లలకి ఎన్నో నేషనల్ మెడల్స్ సాధించడానికి కృషి చేశారని కొనియాడారు. రాబోయే రోజులలో మరిన్ని పతకాలు సాధించేలా చిన్నారులను సన్నద్ధం చేయాలని సూచించారు. కోచ్ ఎండీ ఖాజా మాట్లాడుతూ రైల్వే అధికారుల ప్రోత్సాహం, విద్యార్థుల సహకారంతో తాము పతకాలు సాధిస్తున్నామన్నారు. జాతీయ స్థాయిలో సత్తా చాటిన క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని తక్కిన చిన్నారులు రాణించాలని సూచించారు. కార్యక్రమంలో సత్యనారాయణపురం రింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీహెచ్‌ఓల ఆందోళన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల(సీహెచ్‌ఓ)కు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. గత 15 రోజులుగా ధర్నాచౌక్, హనుమంతరాయ గ్రంథాలయంలో వివిధ రూపాల్లో ఆందోళన కొనసాగిస్తున్నారు. గురువారం హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.సందీప్ కుమార్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఆరేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న సీహెచ్‌ఓలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలన్నారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలి, రద్దు చేసిన ఈఎఫ్‌పీవోను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని, నిర్దిష్టమైన జాబ్ చార్ట్ ప్రకటించాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ నుంచి సీహెచ్‌ఓలను మినహాయించాలని, హెచ్ఆర్ పాలసీతోపాటు ట్రాన్స్‌ఫర్, ఇంక్రిమెంట్, ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. సీహెచ్‌ఓలకు కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో అసోసియేషన్ ప్రతినిధులు, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పద్యనాటకం



గయోపాఖ్యానం నాటకంలోని సన్నివేశం

విజయవాడ కల్చరల్: చైతన్య నాట్యమండలి 31వ వార్షికోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం ప్రదర్శించిన గయోపాఖ్యానం పద్యనాటకం ఆకట్టుకుంది. చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు రచించిన నాటకం ఆద్యంతం నటీనటుల ప్రతిభకు అద్దం పట్టింది. గంధర్వరాజు గయుని సంహరిస్తానని శ్రీ కృష్ణుడు ప్రతిన బూనడం, నారదుని సూచనతో గయుడు అర్జునుడిని శరణు వేడటం, శ్రీ కృష్ణార్జునుల యుద్ధం తదితర అంశాలతో నాటకం సాగింది. కృష్ణునిగా బొడ్డు జయరాజ్, అర్జునుడిగా పుష్పాల రంగారావు నటించారు. కళాపోషకుడు బీఎస్ రాజు, సీనియర్ న్యాయవాది తోట శ్రీనివాస్, సంస్థ అధ్యక్షుడు మునికుమార్, వ్యవస్థాపక కార్యదర్శి బీజే రాజు, సాంస్కృతిక కార్యదర్శి ఇవాంజిలిన్ తదితరులు పాల్గొన్నారు.

ఆ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

సీలింగ్ ల్యాండ్స్ కేసులపై ఆర్డీఓలను ఆదేశించిన కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీలింగ్ ల్యాండ్స్‌కు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ డివిజనల్ అధికారు(ఆర్‌డీవో)లను కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ ఆదేశించారు. నగరలోని కలెక్టరేట్ నుంచి గురువారం సీలింగ్ ల్యాండ్స్ కేసులపై తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై ఆర్డీఓలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ భూ సంస్కరణల చట్టం 1973 ప్రకారం ఆర్డీఓలు డివిజన్ పరిధిలో ట్రిబ్యునల్ అథారిటీ అయినందున సంబంధిత కేసులను తక్షణమే పరిష్కరించాలన్నారు. సీలింగ్ ల్యాండ్స్ కింద ఆ భూములను స్వాధీనం చేసుకొని 22ఏ నిషేధిత జాబితా నందు సంబంధిత వివరాలను పొందుపరచాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న సీలింగ్ భూములను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వాటికి ఫెన్సింగ్ వేసి ప్రభుత్వ అవసరాల నిమిత్తం వినియోగించాలని ఆదేశించారు. ఇంకా విచారణలో ఉన్న కేసులను తక్షణమే పరిష్కరించి సీలింగ్ భూములను స్వాధీనం చేసుకుని, సర్వే నంబర్, విస్తీర్ణాలను నిషేధిత జాబితాలో పొందుపరచాలన్నారు. ఆ భూములకు సంబంధించి ఏ విధమైన రిజిస్ట్రేషన్లు జరగకుండా సంబంధిత సబ్–రిజిస్ట్రార్‌లను ఆదేశించాలన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో డీఆర్వో ఎం. లక్ష్మీనరసింహం, భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వీధి వ్యాపారులందరినీ సర్వే చేయాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



వీధి వ్యాపారులను సర్వే చేస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలో ఉన్న వీధి వ్యాపారులను సర్వే చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం నగరంలో జరుగుతున్న వీధి వ్యాపారుల సర్వేలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బందరురోడ్డులోని ఇందిరాగాంధీ స్టేడియం వద్ద వీధి వ్యాపారం చేస్తున్న మహిళతో సర్వేలో ఉన్న 45 అంశాలని అడిగి తెలుసుకున్నారు. వ్యాపారస్తుల కుటుంబ సభ్యులు వివరాలు, జీవనాధానం, ఎప్పటి నుంచి వీధి వ్యాపారం చేస్తున్నారు, రోజుకు ఎన్ని గంటల వరకు చేస్తారు వంటి విషయాలను నమోదు చేసి వారికి గుర్తింపు కార్డులను ఇచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ రెండు రోజుల్లో సర్వే మొత్తం ముగించి వీధి వ్యాపారస్తుల కచ్చితమైన నివేదికను సమర్పించాలని, అందుకు అనుగుణంగా వెల్ఫేర్ సెక్రటరీలుగా నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ సర్వేలో ఆరుగురు సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో వీటిని పొందుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జోనల్ కమిషనర్లు ఈ సర్వే మొత్తం పర్యవేక్షించి ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ ఆఫీసర్ (పీవో యూసీడీ) పి.వెంకటనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీల రద్దుకు డిమాండ్



వినియోగదారుల అదాలత్‌లో విద్యుత్ సమస్యలు తెలుపుతున్న సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ అదనపు లోడు, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు అదాలత్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం పీడబ్ల్యూడీ మైదానం సమీపంలోని ఏపీసీపీడీసీఎల్ ఎస్‌ఈ కార్యాలయం వద్ద విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు జరిగింది. సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్ పాల్గొన్నారు. అదాలత్‌లో విద్యుత్ లైన్లు మార్పు, లోడ్ రిలీఫ్, స్మార్ట్ మీటర్లు, అదనపు బిల్లులకు సంబంధించి 7 ఫిర్యాదులు అందాయి. సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, వినియోగదారులకు న్యాయం చేయాలని కోరారు. నివాస ప్రాంతాలపై విద్యుత్ వైర్లు తొలగించాలని అదాలత్‌లో విన్నవించారు. అదాలత్‌లో ఎస్‌ఈ సాంబశివరావు, ఎస్ శ్రీనివాసరావు, ఏ సునీత, ఆర్సీహెచ్ శ్రీనివాసరావు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తనా గానం



అన్నమయ్య సంకీర్తనలు గానం చేస్తున్న బీవీఎస్ కృష్ణ

విజయవాడ కల్చరల్: శ్రీ వేంకటేశ్వర సంకీర్తనా అకాడమీ(శ్వాస), కంచిరామకోటి పీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు భక్తిగా సాగుతున్నాయి. లబ్బీపేట శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో వర్ధమాన సంగీత కళాకారులు మొదలు, సంగీత విద్వాంసుల వరకు అన్నమయ్య సంకీర్తనలను భక్తిగా గానం చేస్తున్నారు. గురువారం నాటి కార్యక్రమంలో జీఎల్ హర్షిత, ఎస్. సాత్విక, ఎం. ప్రమీల, బీవీఎస్ ఎస్. కృష్ణ అన్నమయ్య సంకీర్తనలు మధురంగా ఆలపించారు. కార్యక్రమంలో శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ మాగంటి వేణుగోపాల్, కార్యనిర్వాహకుడు సీహెచ్ రామ్మోనరావు, మేనేజర్ శర్మ పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 28వ డివిజన్‌లోని స్వర హాస్పిటల్ రోడ్డు, నర్రా వారి వీధిలో రూ. 78.35లక్షలతో చేపట్టిన రోడ్డు పనులను ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ వీరమాచనేని లలితతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత సమయంలో నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.